క్లుప్తంగా

పార్వతీదేవికి పూజలు


ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

రాజుపాళెం : మండలంలోని పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవికి పౌర్ణమి సందర్భంగా సోమవారం అర్చకుడు వెంకటాచలపతి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే మల్లె, జాజి, కనకాంబరం పూలు, 303 నిమ్మకాయలు వేసి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భగవద్గీత పఠనంతో జీవితానికి సార్థకత


ప్రవచిస్తున్న దత్త శర్మ

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రపంచానికి మహోపదేశం అందించిన భగవద్గీతను పఠిస్తే జీవితానికి సార్థకత చేకూరుతుందని హైదరాబాదుకు చెందిన బ్రహ్మశ్రీ పాణ్యం దత్త శర్మ పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో సోమవారం ఆయనతో ఆధ్యాత్మిక ప్రసంగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. సంపూర్ణ మానవుడిగా ఎలా జీవించాలో గీత వివరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఏసీ శంకరబాలాజీ, గీతాశ్రమం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షా బంధన్


మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డికి రాఖీ కడుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలో సోమవారం అన్నాచెల్లెల్ల అనురాగానికి చిహ్నమైన రక్షా బంధన్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు బీకే సౌజన్య రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రాఘురామిరెడ్డికి, తహసీల్దారు గంగయ్య, వైద్యులు మహేష్, రామసుబ్బారెడ్డి, లీలావతికి రక్షాబంధన్ కట్టారు. స్థానిక శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు డీఎస్పీ భక్తవత్సలం, పోలీసు సిబ్బందికి రక్షాబంధన్ కట్టారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ గౌరీశంకర్, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ దావీద్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కాశినాయన : మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10–30 గంటలకు మండల పరిషత్ సభా భవనంలో ఎంపీపీ నల్లేరు పోలమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రిష్ణశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ, వ్యవసాయం, ఆరోగ్య, తాగునీరు, ఉపాధి, సంక్షేమం తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. మండలస్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

పోరుమామిళ్ల : పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఎస్‌ఐ కొండారెడ్డిని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యుడు కోరారు. సోమవారం కొండారెడ్డికి వినతిపత్రం అందచేశారు. పట్టణ ప్రధాన రహదారిలో వాహనాలు వేగంగా నడిపేవారిపై చర్య తీసుకోవాలన్నారు. వేగ నియంత్రణపై పోలీసులు శ్రద్ధ పెట్టాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ చీఫ్ గంగన్న, పబ్లిసిటి ఆఫీసర్ ఫణిరావు, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులను ఆదుకోండి

అట్లూరు : కేరళ రాష్ట్రంలోని వయనాడ్ బాధితులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గమ్మ, రమణ కోరారు. వయనాడ్ జిల్లాలో వరదలతో వందలాది మంది మృతి చెందారని, సంబంధిత బాధిత కుటుంబాలకు అండగా ఉండేందుకు సోమవారం మండల పరిధిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. జాతీయ విపత్తు కింద కేరళ బాధితులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుభద్రమ్మ, స్వప్నమ్మ, పాపులమ్మ, మస్తానమ్మ, గంగయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

సేంద్రియం.. నేలకు జీవం

వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువైంది. వాటి ధరలు రెక్కలు తొడిగి పెట్టుబడి రెట్టింపు అవుతోంది. భూమి నిస్సారం అవుతోంది. ఏటేటా దిగుబడి కూడా తగ్గితోంది. సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంట ఆరోగ్యమని అందరికీ తెలుసు. మా పూర్వీకులు సేంద్రియ ఎరువులతో సాగుచేసిన తిండి తిన్నారు.. కాబట్టి వందేళ్లు ఆరోగ్యంగా జీవించారని చెప్పుకోవడమే తప్పా.. సేంద్రియ, ప్రకృతికి సాగుకు మాత్రం ఎవరూ ముందుకు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో సేంద్రియ సాగును ప్రభుత్వాలు కూడా ప్రోత్సహిస్తున్నాయి.

- చేనుకు బలిమి... రైతుకు మేలిమి
- తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడి
- సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్న అధికారులు


పొలాల్లో సేంద్రియ ఎరువు చల్లుతున్న రైతులు

రాజుపాళెం : గతంలో చాలామంది రైతులు సేంద్రియ ఎరువులను వాడేవారు. కాలక్రమేణా పశువుల పేడ, గొర్రెల ఎరువు లభ్యత తగ్గిపోయింది. దీంతో చాలామంది రైతులు రసాయనిక ఎరువులపై దృష్టి సారిస్తున్నారు. వీటి వాడకంతో పొలాల్లో భూసారం తగ్గిపోవడంతో పాటు దిగుబడులు పడిపోతున్నారు. దీనికి తోడు పెట్టుబడి ఖర్చులు అధికమై కర్షకులు తీవ్రంగా నష్టపోతున్నారు. అన్నదాతలు సాధ్యమైనంత వరకు సేంద్రియ ఎరువులు వాడితే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు ఆశించిన మేర వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రాజుపాళెం మండలంలో 42 వేల ఎకరాలు సాగు భూమి ఉంది. రైతులు ఏటా ఖరీఫ్‌లో పత్తి, మినుము, పెసర, వేరుశనగ, మొక్కజొన్న, మిరప, పసుపు, జొన్న, ఉల్లి రబీలో శనగ తదితర పంటలను సాగు చేస్తారు. పైరు ఎదుగుదలతో పాటు దిగుబడులపై ఎరువుల ఆవశ్యకత ఉంది. చాలా గ్రామాల్లో కర్షకులు అధికంగా దిగుబడులు రావాలన్న ఉద్దేశంతో ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులను పంటల్లో వాడుతున్నారు. దీంతో ఏటేటా భూసారం తగ్గి దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. ఫలితంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు.

సేంద్రియ పద్ధతులతో కలిగే లాభాలు

రైతులు సేంద్రియ ఎరువులను వాడడంతో దీర్ఘకాలికంగా ప్రయోజనం పొందవచ్చు. ప్రధానంగా పచ్చిరొట్ట, పశువుల పేడ, పొలాల్లో గొర్రెలు, మేకలను ఉడిగించడం, వానపాముల ఎరువులను పొలాల్లో చల్లించడం ద్వారా భూసారం పెరుగుతుంది. దీంతో రైతు ఆశించిన మేర కంటే అధికంగా పంట దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పశువుల పేడను పొలాల్లో ఎరువుగా ఉపయోగించడం వలన పెట్టుబడి సైతం తక్కువగా ఉంటుంది. అలాగే దీని వాడకంతో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసినట్లు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

రసాయనికంతో నష్టాలు

రైతులు అధికంగా రసాయనిక ఎరువులను వేయడం వలన తాత్కాలిక ప్రయోజనాలు చేకూరుతున్నప్పటికీ దీర్ఘకాలంలో వ్యవసాయ సాగులో భూసారంపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పశుపోషణ బాగా తగ్గడంతో సేంద్రియ ఎరువుల వాడకం కష్టతరంగా మారింది. దీంతో రైతులు ఎక్కువగా రసాయనిక ఎరువులను వాడుతున్నారు. దీనికి తోడు అధిక దిగుబడులు రావాలని ఎక్కువ మోతాదులో ఎరువులను వేస్తున్నారు. సకాలంలో వర్షాలు రాకపోవడంతో పంట ఎదుగుదలపై ప్రభావం చూపి దిగుబడులు తగ్గడానికి కారణం అవుతున్నాయి.


ఎరువుతో ఎంతో ప్రయోజనం



పశువుల ఎరువులను పొలాల్లో వేయడం వలన ఎంతగానో ప్రయోజనం ఉంది. గతంలో చాలామంది రైతులు సేంద్రియ ఎరువులను పొలాల్లో చల్లేవారు. తద్వారా ఆశించిన దానికంటే ఎక్కువగానే దిగుబడులు వచ్చేవి. నేడు పల్లెల్లో పశువుల సంతతి తగ్గిపోవడంతో పేడ లభించడం గగనంగా మారింది. దీంతో రైతులు రసాయనిక ఎరవులను వాడుతున్నారు. దీంతో ఖర్చులు అధికమై దిగుబడులు తగ్గుతున్నాయి. కర్షకులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– దొంతిరెడ్డి రంగారెడ్డి, రైతు, కొట్టాల గ్రామం, రాజుపాళెం మండలం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



రైతులకు సేంద్రియ ఎరువుల వాడకం, రసాయనిక ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం. దీనిపై కర్షకులు కూడా సానుకూలంగా స్పందిస్తున్నారు. పల్లెలో కొంతమంది రైతులు ఇప్పటికి పొలాల్లో పేడను చల్లుకుంటున్నారు. దీంతో ఆశించిన స్థాయి కన్నా ఎక్కువగా దిగుబడులు వస్తున్నాయని వారే చెబుతున్నారు. రైతులు ముందుగా భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాల ఆధారంగా పంటల్లో ఎరువులను వాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– శివరామ కృష్ణారెడ్డి, వ్యవసాయాధికారి, రాజుపాళెం మండలం

నేత్రదానంతో సజీవం


బుడ్డారెడ్డిగారి శ్రీలక్ష్మి

ప్రొద్దుటూరు : కళ్లను దానం చేయడం ద్వారా చూడలేని మరొకరికి చూపుని కల్పించవచ్చు. తమ కళ్ల వేరొకరికి అమరిన కారణంగా.. వారి చూపుల్లో మృతులు సజీవంగా ఉండిపోతారు. ఓ మహిళ తాను చనిపోయినా మరొకరికి కంటిచూపు నిచ్చి ఆదర్శంగా నిలిచింది. మండలంలోని ఈశ్వరరెడ్డి నగర్‌కు చెందిన స్నేహ సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి భార్య బుడ్డారెడ్డిగారి శ్రీలక్ష్మి సోమవారం మృతి చెందారు. నేత్రదానం చేస్తామని జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పులివెందులకు చెందిన స్నేహిత అమృత హస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం అందించారు. టెక్నీషియన్ హరీష్ శ్రీలక్ష్మి పార్థివ దేహం నుంచి కార్నియాలను సేకరించారు. కార్నియాలను హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపినట్లు రాజు తెలిపారు. అంధరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

బద్వేలు అర్బన్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శంకర్ పేర్కొన్నారు. సోమవారం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో పొందుపరిచిన ప్రకారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, పట్టణ నాయకులు మనోజ్, వంశీ పాల్గొన్నారు.

దళితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న రాజకీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

కడప కార్పొరేషన్ : బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సి.కొత్తపల్లె గ్రామంలోని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, పక్కా గృహాలు కూడా మంజూరు చేయాలని రాజకీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కిషోర్ బూసిపాటి, బి.నారాయణ, ఎస్‌ఏ సత్తార్, గుర్రప్ప, సీఆర్‌వీ ప్రసాద్, శ్రీరాములు, రసూల్ కోరారు. సోమవారం వారు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వినతి పత్రం సమర్పించారు. సి.కొత్తపల్లె గ్రామ వాసులు ఇంటి స్థలాలు లేక ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే, తెలుగుదేశం పార్టీ ముసుగులో ఉన్న అగ్రకులస్తుడైన రామచంద్రారెడ్డి 25 మంది అనుచరులతో వెళ్లి గుడిసెలు తొలగించి, ఈ రెండు ఎకరాల స్థలాన్ని తాను కొన్నానని, దళితులను ఇష్టం వచ్చినట్లు కొట్టారన్నారు. మహిళలని చూడకుండా జుట్టుపట్టి ఈడ్చి పిడిగుద్దులు గుద్దారన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు అధికార పార్టీ నాయకులను వెనకేసుకు రావడం దారుణమన్నారు. దళితులకు ప్రాణ రక్షణ కల్పించి, జిల్లాలో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బద్వేల్ పరిధిలో భూ వివాదాలు ఎక్కువగా ఉన్నాయని, ఫిర్యాదులు కూడా ఎక్కువగా వస్తున్నాయన్నారు. వచ్చే శుక్రవారం ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, డీఎస్పీలతో సమావేశం ఏర్పాటు చేసి భూ ఆక్రమణలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి బాధితుల తరఫున రాజకీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కూడా రావాలని సూచించారు.

లలితా దేవికి ఘనంగా కుంకుమార్చన


ప్రత్యేక అలంకరణలో లలితాదేవి


పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా లలితాదేవికి ప్రతేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున లలితాదేవికి, శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా పసుపు, కుంకుమ, పూలు, పళ్లు, అమ్మవారి చిత్రపటాన్ని అర్పించి మంగళ హారతులు ఇచ్చారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి తమను కాపాడమని వేడుకున్నారు. పూజా కార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అన్నదానం

స్థానిక శివాలయం వీధిలోని నందిని క్లాత్‌మార్కెట్ సమీపంలో పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ పాదవల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఘనంగా చండీ హోమం

స్థానిక అగస్త్యేశ్వరాలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ఘనంగా చండీ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమం, చండీ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వేదపాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరశర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా గంపా రాజారాం, గంపా ప్రశాంతి, గంపా తేజ , గంపా తరుణ్‌కృష్ణ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మురుకూటి సూర్యానారాయణరెడ్డి, విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


ఎస్టీకాలనీలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

చాపాడు : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని మండల ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య అన్నారు. మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో సోమవారం లార్వా, పీవలర్ నిర్వహించి, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని ఎలాంటి జ్వరాలు వచ్చినా వైద్య సిబ్బందిని సూచనలు పాటించాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

బద్వేలు అర్బన్ : హైకోర్టు ఆదేశాలు, జిల్లా కోర్టు సూచనల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కుమ్మరికొట్టాలు ఎస్టీకాలనీలో వైద్యశిబిరం నిర్వహించారు. తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్, సురేంద్రనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో కాలనీవాసులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దూరం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆయా ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, పారాలీగల్ వాలంటీర్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జా భూమిని స్వాధీనం చేసుకోవాలి


రిలేనిరాహారదీక్షలు నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని సి.కొత్తపల్లెలో కబ్జాకు గురైన కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీనం చేసుకుని కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సి.కొత్తపల్లె పొలంలో కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని, 6 నెలలుగా ఆందోళనలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. అలాగే ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. పేదల గుడిసెలను తొలగించి దళిత మహిళలపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ, తహసీల్దారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు జకరయ్య, కేశవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రమణ, రామకృష్ణారెడ్డి, రవిచంద్ర, రామ్మోహన్, దుర్గమ్మ పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు


విద్యాకమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసులు

పోరుమామిళ్ల : జీవితంలో అద్భుతమైనది, మళ్లీ తిరిగి రానిది బాల్యమని, నేటి బాలలే రేపటి పౌరులని సీఐ శ్రీనివాసులు అన్నారు. మండలంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన విద్యాకమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కొండారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించారు. నూతన కమిటీ మెంబర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలని, చెడు అలవాట్లకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ కొండారెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎర్రచందనం స్మగ్లర్లు, రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెడు ప్రవర్తన మానుకుని సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గాడిలో పెట్టేనా..!

కొత్త సీఐకి సవాళ్ల స్వాగతం

ఖాజీపేట : ఖాజీపేట నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన మోహన్‌కు స్టేషన్ పరిధిలో పలు సవాళ్లు ఉన్నాయి. స్టేషన్‌కు వెళితే న్యాయం జరుగుతుందన్న భరోసా ప్రజల్లో తగ్గిపోతోంది. ప్రజా సమస్యలకు అధిక ప్రధాన్యత ఇచ్చి శాంతి భద్రతల పరిరక్షణకు సీఐ కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దొంగల బెడద

ఖాజీపేటలో దొంగల బెడద అధికంగా ఉంది. ముఖ్యంగా బస్టాండ్ కూడలిలో ఆరు, అగ్రహారంలో రెండు చోరీలు జరిగాయి. ఏటీఎం చోరీ విఫలయత్నంతోపాటు ఆలయాల్లో హుండీలను అపహరించుకుపోయారు. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలను దుండగులు తస్కరించుకుపోతున్నారు. ఇప్పటి వరకు సుమారుగా 50 చోరీలు జరిగాయి.

జోరుగా మట్కా

మండలంలో మట్కా జోరుగా సాగుతోంది. మట్కా ఏజెంట్లు రూ.లక్షల్లో దందా కొనసాగిస్తున్నారు. గతంలో రహస్యంగా కాగితం చిట్టీలపై నంబర్లతో మట్కా సాగేది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో ఫోన్‌ల ద్వారా జోరుగా మాట్కా దందా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. పేకాట, మట్కా మన సంప్రదాయం కాదని వాటిని పూర్తిగా నిరోధించాలని ప్రభుత్వాలు ఆదేశించినప్పటికీ అది ఎక్కడా అమలు కావడం లేదు. క్రికెట్ బెట్టింగ్‌లు మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతున్నాయి. యువత బెట్టింగ్‌లకు పాల్పడుతూ సర్వం కోల్పోతున్నారు. డబ్బులు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు అనేకం ఉన్నాయి.

ఎర్రచందనం అక్రమ రవాణా

ఎర్రచందనం అక్రమ రవాణా కూడా పెరిగింది. నాగసానిపల్లె, పత్తూరు దగ్గర ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇప్పటికే మూడు కేసులు నమోదు చేశారు. ఎర్రచందనం రవాణాను పోలీసులు, ఫారెస్ట్ అధికారులు అరికట్టడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఎక్కడ చోరీ జరిగినా దొంగల కోసం దుకాణాదారులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను పోలీసులు ఆశ్రయిస్తున్నారు. అసాంఘిక చర్యలను పోలీసులు కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చరిత్రకు సజీవ సాక్ష్యం చిత్రం


కేక్ కట్ చేస్తున్న ఫొటో స్టూడియో యజమానులు

పోరుమామిళ్ల : కాలగర్భంలో కలిసిపోయిన చరిత్రకు చిత్రం సజీవ సాక్ష్యమని ఫొటో స్టూడియో యజమానుల సంఘం నాయకుడు డి. శ్రీనివాసులు అన్నారు. సోమవారం పట్టణంలో వివేకానంద భవన్‌లో పట్టణ ఫొటో స్టూడియో యజమానులు ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, కమల్, బడేసాబ్, అక్రమ్, నబి, రఫీ, బాలు పాల్గొన్నారు.

లూయిస్ దాగురేకు నివాళి

మైదుకూరు : మైదుకూరులో ప్రపంచ ఫొటోగ్రఫీడే సందర్భంగా సోమవారం కెమెరా సృష్టికర్త లూయిస్ దాగురేకు నివాళులు అర్పించారు. మైదుకూరు ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక రాయల కూడలిలో లూయిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లూయిస్ దాగురే సృష్టించిన కెమెరాతో ఎన్నో జ్ఞాపకాలు నిక్షిప్తం కావడం అద్భుతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం రక్షించాలి.. పన్ను పోటు తగ్గించాలి


మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా రోగ్యం రక్షించాలి.. పన్ను పోటు తగ్గించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ పట్టణంలో డెంగీ, మలేరియా జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వ్యాధుల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రెస్టారెంట్లు, హోటళ్లు, ఆస్పత్రుల వారు మురికి కాలువల్లో విచ్చలవిడిగా వ్యర్థాలు వేస్తున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రతి ఏటా రెసిడెన్షియల్ జోన్, కమర్షియల్ జోన్ అంటూ పన్నుల శాతం పెంచుకుంటూ పోతున్నారే తప్పా.. ప్రజలకు సౌకర్యాలు కల్పించలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజారోగ్య పరిక్షణ మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సమితి సభ్యులు గోపాలం రామకృష్ణ, చంద్రశేఖర్, వై.హరి, జింకా గురుస్వామి, మచ్చా శ్రీను, ప్రమీల, సుజాత, ఏఐఎస్‌ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, టోని, నాని, తౌసిఫ్ పాల్గొన్నారు.

పెంచిన ఇంటి పన్ను తగ్గించాలి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీలో పెంచిన ఇంటిపన్నులు తగ్గించి పాత పద్ధతిలోనే ఇంటిపన్నులు కట్టించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని చాలా ప్రాంతాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సీజనల్ వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉందని అన్నారు. మున్సిపల్ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు : నిరుద్యోగ యువతీ యువకులు స్కిల్ హబ్ కేంద్రం అందించే ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డి.నాగార్జున ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ, ఉపాధికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. స్కిల్ హబ్ కేంద్రంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సుకు 3 నెలల పాటు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. కనీస విద్యార్హత పదో తరగతి నుంచి ఆపై చదివి ఆసక్తిగల నిరుద్యోగ యువతీయువకులు ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8886297300 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.